ప్రేమపాశం

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

(తరువాయి)

రెండో అంకం

మొదటి రంగం

[బంగారమ్మ వీధిఅరుగుమీద గోడకి ఆనుకొని కూచునివుంటుంది.]

బంగారమ్మ—(స్వగతం) మళ్లీ యెప్పుడు వస్తాడో బావ! మాయింటోనే భోజనంచేస్తూ మాయింటోనే వుండరాదూ? భోజనంకోసం యీయింటికీ, ఆయింటికీ పరిగెత్తడం యేం సుఖమూ? ఒకచోట పొద్దోతుంది. అప్పుడు పొద్దున్న వుండడం కష్టం. ఒకచోట తొమ్మిదింటికే అవుతుంది. అప్పుడు రాత్రి దాకా వుండడం కష్టం. రూపాయలకి రూపాయలు కాఫీహోటళ్లలో గుమ్మరించాలి. ఇక వారాల లాభం యేమిటి? కాకపోయినా, వొకయింటో పప్పూ, కూరా, చారూ—యిలాంటివి పెడతారు. కొన్ని యిళ్లల్లో వట్టివూరగాయే వేసి పెడతారు. వొకర్తి "యేగో తింటాడు, పోతాడు" అని నిర్లక్ష్యంగా పెడుతుంది. వొకర్తి విధిలేక రుంజుకుంటూ పెడుతుంది. ఆదరించి పెట్టే యిల్లాళ్లు తక్కువవుంటారు. యెలా తింటు న్నాడో బావ? యెలా కాలం గడుస్తోందో?

మాయింటోనే యెందుకుండగూడదమ్మా? మా నాన్న మేనమామాయెను. తను మేనల్లుడు. మాఅమ్మ భేదం యెరగదు. నేను ప్రాణం యిస్తాను. యేంలోటు? యేం తక్కువా? చాలామంది యిళ్లల్లాగ అసహ్యంగా వుండదు మాయిల్లు. వేసంకాలంలో డాబామీద పడు కుంటే యెంతసుఖంగా వుంటుందీ? యిల్లంతా నాప రాయేకదా? తను ప్రత్యేకంగా వొకగది పుచ్చుకో వచ్చు.

నేను వుండమంటే వుంటాడు. నేనంటే దయే బావకి. వొళ్లో కూచుంటే సంతోషించాడు కదా? అయితే యిదోకష్టం వచ్చిలావుంది. నిన్న యిట్టే వచ్చి పదిరూపాయలు చేతిలోపెట్టాడు. ఇందాకా వీసెడు మిఠాయి తీసుకువచ్చాడు. వొద్దు మొర్రో అని యెంత చెప్పినా సనేమిరా అన్నాడు; గాని మానేడా? వచ్చి నప్పుడల్లా యిలా అయితే కష్టమే. సంగీతంపాడి సంపా దించుకున్న డబ్బంతా యిలాఖర్చుపెడితే—యింకా పెళ్లికావాలి కూడానూ.

(అప్పుడు వెంకన్న వస్తాడు.)

వెంకన్న—(స్వగతం) బంగారం అరుగుమీదే కూచుంది. నేనంటే దీనికిష్టమే. నన్ను చూసిందంటే ముందు తనే పలకరిస్తుంది. (ఆమెయెదట ముసిముసి నవ్వులు నవ్వుతూ నుంచుంటాడు)

బంగారమ్మ—(స్వగతం) వీడు వచ్చాడెందుకూ యిప్పుడూ?

వెంకన్న—(స్వగతం) పలకరించదేం?

బంగారమ్మ—(స్వగతం) మొద్దులాగ నుంచు న్నాడెందుకూ?

వెంకన్న—మాట్లాడవేమే బంగారం?

బంగారమ్మ—నువ్వెందుకు మాట్లాడావుకాదూ?

వెంకన్న—మావూరునుంచి వస్తే—

బంగారమ్మ—ఎప్పుడు వచ్చావురా?

వెంకన్న—యిప్పుడేగాదూ యింకా వస్తున్నా నూ? మూట యింకా బుజంమీదే—

బంగారమ్మ—అయితే యింటోకిపద.

వెంకన్న—(స్వగతం) తను లేవదేం? (ప్రకాశం) మాఅమ్మగూడా వస్తోంది.

బంగారమ్మ—ఏదీ?

వెంకన్న—అదిగో (వీధికేసిచూసి) అమ్మోయి! బంగారం వీధిలోనే కూచుందేవ్!

(అప్పుడు కోటమ్మ వస్తుంది.)

కోటమ్మ—ఇదిగో బంగారమే! వీధిలో కూచున్నావేమే?

బంగారమ్మ— వీధిలో కూచోలేదు, పెద్దత్తా, అరుగుమీద కూచున్నాను గానీ.

కోటమ్మ—అదీయిదీ వొకటికామా? ...పోనీ, మీనాన్న వూళ్లో వున్నాడా?

బంగారమ్మ—వున్నాడు. బజారుకికామోసు వెళ్లాడు.

వెంకన్న—యింటోకి వెడదాంరావే బంగారం!

బంగారమ్మ—మీరు పదండి, నేను తరవాత వస్తాను.

కోటమ్మ—నడవరా.

(తల్లీ, కొడుకూ లోపలికివెడతారు)

బంగారమ్మ—యిప్పుడు వచ్చారెందుకూ వీళ్లూ? ఎక్కడికో వెడుతున్నారు కాబోలు. చదువూ లేదు సంధ్యాలేమూ, మాటలు మాత్రం మెయ్యగలడు వీడు. పెద్దత్త యెక్కడికి వెళ్లినా వీణ్ణే తీసుకువెడుతుంది. చచ్చు పెద్దమ్మ. అప్పుడే పధ్దెనిమిదేళ్లు వెళ్లాయి. నేనే నయం, ఆరోతరగతి చదివాను.

(వెంకన్న మళ్లీవస్తాడు)

వెంకన్న—వోశావ్! బంగారమ్మోయ్! నీ కోసం పోకుండలు తెచ్చింది మాఅమ్మ. రా యింటోకి వెడదాం.

బంగారమ్మ— పోకుండలా? యెలా వుంటాయవీ? యేంచేసు—

వెంకన్న—తియ్యబెల్లం. తింటే వదలవు నువ్వు. పైకి బూరిల్లాగ—వేయించిన కొబ్బరికాయముక్కలూ, నువ్వుపప్పూ—యెంతరుచిగా వుంటా యను కున్నావ్?

బంగారమ్మ—నేనెప్పుడూ ఆపేరే వినలేదూ. యిప్పుడెందుకు తెచ్చారూ?

వెంకన్న—నీకోసమే. తిందువుగాని రా యించక్క. నీమీద మాఅమ్మకెంతో యిష్టం. నువ్వంటే నాకెంత—(గుడ్లుతిప్పుకుంటూ) అనుకున్నావ్? నిన్ను పెళ్లాడతానునేను. మాఅమ్మ ముహూర్తం పెట్టించడానికే వచ్చింది. రా చిలకాగోరింకల్లాగ యింటోకి వెడదాం. (చెయ్యి పట్టుకోపోతాడు)

బంగారమ్మ—వుండు. అక్కడ నుంచోలేవూ? నువ్వుపో యింటోకి. నే నిప్పుడురాను. పో! నుంచుంటావేం?

వెంకన్న—తొరగారావాలి సుమా కాళ్లు కడుక్కోడానికి నువ్వే యిస్తావంది మ అమ్మ, నాకు నీళ్లు. (వెళ్లిపోతాడు.)

బంగారమ్మ—వోరిచచ్చు—

వెంకన్న—(మళ్లీవచ్చి) నువ్వు వచ్చేదాకా పోకుండలమూట విప్పను. (వెళ్లిపోతాడు.)

బంగారమ్మ—వీడి పోకుండలు కాలా. దున్నపోతూ. నన్ను పెళ్లాడతాట్ట. అవ్వ. (అని నోరుమూసుకొని) సిగ్గుసిగ్గు. యిక్కడకూచుంటే మళ్లీవస్తాడు. వాళ్లసూరమ్మతో ఆడుకుంటాను వెళ్లీ.

(బంగారమ్మ వెళ్లిపోతుంది. వెంకన్నా, పోకుండలమూటతో కోటమ్మా మళ్లీవస్తారు.)

కోటమ్మ— నేను తీసుకువస్తానుండు. నిన్ను చూసి సిగ్గుపడింది. మొగుడంటే సిగ్గెరగదనుకున్నావాయేమిటి, పన్నెండేళ్లపిల్లా?

వెంకన్న—ఏదీ?

(ఇద్దరూ తెల్లపోతారు.)

కోటమ్మ—యేదారినో యింటోకే వెళ్లింది, రా.

(ఇద్దరూ లోపలికివెడతారు.)

రెండోరంగం

[వాకట్లో వెంకటశాస్త్రీ, కాంతమ్మా, కోటమ్మా, వెంకన్నా చేపరి కూచునివుంటారు. బంగారమ్మ తల్లి పక్కని కూచునివుంటుంది.]

వెంకటశాస్త్రి—"సంగతి యిదీ" అనిచెప్పకుండా "నేనెందుకు వచ్చానో తెలుసునా తమ్ముడూ?" అంటే యెలా తెలుస్తుందే అక్కయ్యా?

కాంతమ్మ—గంపంత వూహ మనస్సులో పెట్టుకుని వచ్చినట్టుంది పెద్దవొదిన.

వెంకన్న—మామ బంగారాన్ని నాకే యిస్తాడు.

కోటమ్మ— చెప్పాలిట్రా తమ్ముడూ నోరు చేసుకునీ? అయినా చల్లకివచ్చి ముంతదాచడం యెందుకూ? ఇలారా బంగారం వోమాటూ.

(బంగారమ్మ మాట్లాడదు. అలావెళ్లదు. మెంగం వంచుకుంటుంది.)

కాంతమ్మ—అదేమిటో చెప్పు వొదినా, బంగారం వస్తుందిలే. అయినా పెద్దత్త పిలుస్తోంది, వెళ్లవే.

వెంకటశాస్త్రి—అమ్మాయిమొగమాటం మా పెద్దక్క యెరిగిందే-దగ్గిరికి వెళ్ల దేమిటే? ఏమిటేఅక్కయ్యా?

కోటమ్మ—చెప్పడాని కేంవుంది తమ్ముడూ? బంగారాన్ని మావెంకడికి అడగడానికీ—యింకెందుకూ? ముహూర్తం స్థిరపరిపించడానికే వచ్చాను.

(కాంతమ్మ చకితురాలవుతుంది. బంగారమ్మ తల్లికేసి చురచురాచూసి వీధిలోకి వెళ్లి పోతుంది. వెంకన్న కనబడినంతసేపూ ఆమెనే మూస్తాడు.)

కాంతమ్మ—(స్వగతం) యిదా అమ్మా? మంచి మాటే. అమ్మాయి చెప్పుదెబ్బ కొట్టినట్టు మహాబాగా వెళ్లిపోయింది.

వెంకటశాస్త్రి—(స్వగతం) పెద్దయిత్తే!

వెంకన్న—(స్వగతం) పెళ్లిమాట చెప్పాటప్పటికి బంగారం చటుక్కున అవతలికి వెళ్లిపోయింది. ఎల్లమాలిన సిగ్గూ దానికి.

కోటమ్మ—ఏమంటావు తమ్ముడూ?

వెంకటశాస్త్రి—నువ్వడగనూ వచ్చు, నేనివ్వనూ వచ్చు. యిందులో యేమీ తప్పూలేదు, వింతాలేదూ. అయినా బంగారం చిన్నపిల్ల. అప్పుడే తొందరేమిటే?

కోటమ్మ—అదేమిట్రా అలాఅంటావూ? పన్నెండేళ్లు వెడతాయిరేపు కార్తీకం పున్నానికి. తల్లి పద్నాలుగేళ్లదాకా వున్నా, అమ్మమ్మ పదకొండేళ్లకే సమర్తాడిందిట. పిల్ల బొబ్బిల్లాగ బొద్దుగాకూడా వుంది. ఈయేడు పెళ్లిచెయ్యకపోతే కష్టంసుమా, యేమనుకున్నావోగాని నువ్వూ.

వెంకటశాస్త్రి—రజస్వల అయితేమాత్రం కొంప మునిగిపోతుందా యేమిటి అమాంతంగాను?

కోటమ్మ—పట్టంలో ప్రవేశించాక యిలాంటి బుద్ధులు పుట్టాయేమిట్రా నీకూ? మనవంశం యెలాంటిది? మనతాత యెంతచదువుకున్నాడు? నాయనమ్మ యెంత ఆచారంగా వుండీది? అమ్మ చాదస్తం—

వెంకటశాస్త్రి—ఏమిటో? చూడూ పెద్దక్కా! అదంతా పూర్వకాలం. ఇప్పటివాళ్లకి ఆపద్ధతులు నచ్చవు.

కాంతమ్మ—దానికేంగానీ: ఈయేటికి మేం పెళ్లిచెయ్యలేము వొదినా! నీకు తెలవందేముందీ?

వెంకటశాస్త్రి—అదీ వొకకారణమే. మొన్నమొన్ననే మేడపని పూర్తయింది. కోమట్లపుణ్యమా అని నాలుగు వేలతో కొంప వేసుకొన్నాం. ఆమంచి యిల్లాలు రాధాబాయమ్మగారు మొన్ననే నుయ్యి కట్టించిపెట్టింది. యింకా యింటికి తగిన హంగు సంపాదించుకోడం తరవాయే. యిలాంటప్పుడు అమ్మాయికి పెళ్లిఅంటే మాట తక్కుతుందా?

కోటమ్మ—పెళ్లి పేరుచెప్పి ప్రత్యేకంగా యెవరూ యివ్వకపోతే మాత్రంనువ్వు విడిచేతులతోవున్నావా యేమిటి? అయినా యేదోకార్యం అయిందనిపించుకుని వెళ్లిపోతాం మేము. నువ్వేమీ పెద్దపరుగులు పెట్టనక్కర్లేదు. లోకంలో అందరూ యిస్తున్నారు గనక నువ్వు

కవెండికి మురుగులూ, వెండిమరచెంబూ, వెండికంచమూ, పట్టుతాపితాలూ ఇయ్యి. పైగా రొక్కం నూటప దహార్లు చాల్లే. యింటికి పెద్దాడబకుచునైనందు కిది వరకీ నువ్వు నాకు లోటుచెయ్యలేమా. యికముందూ చెయ్యవూ. నామాటకేమిలే. నీకు తోచినంత యివ్వ వచ్చు. వొక్క ఆడపకుచుకనక మాఅమ్మాయికి వొక్క యాభై రూపాయలు ముట్టచెప్పు. నేనేమీ యెక్కువ అడుగలేదు. పప్పూ వణ్ణమూ పెట్టు. తొంబతో రావ డం మీ కిష్టంలేకపోతే వరపంచకంగా వస్తాం మేము.

వెంకన్న—(స్వగతం) పట్టుతాపితాలు నే నెప్పుడేనా కట్టుకుంటూంటాను. రోజూ కట్టుకుంటే మాసిపోతాయి.

కాంతమ్మ—(స్వగతం) ఇవన్నీ—యింకా యివ్వ వలసిన సమ్మంధమే. పెళ్లికొడుకుని చూశాటప్పటికి మరొకళ్లయితే గుమ్మరిస్తారు. (నవ్వుకొంటుంది)

వెంకన్న—(స్వగతం) అత్త నవ్వుకుంటోంది. యిష్టమే.

వెంకటశాస్త్రి—(స్వగతం) వరుడంటే శ్రీ కృష్ణుడుతరవాత వీణ్ణేచెప్పాలి. వెయ్యిన్నూట పద హార్లుకూడా వీడికి తక్కువే.

కోటమ్మ—(స్వగతం) వొప్పుకుంటారు. నేను తక్కువ అడిగానేమో! అయిదువంద లడగవలసింది... మించిపోయిందేంవుందీ? పెళ్లిలో పట్టుపడితేసరీ (ప్రకాశం)వూరుకున్నావేం తమ్ముడూ? నీవుద్దేశం కూడా చెప్పవే మరదలా!

కాంతమ్మ—నాయిష్టం యేంవుంది వొదినా! మీ తమ్ముడూ మీరూ, ఆలోచించుకోండి.

వెంకటశాస్త్రి—నువ్వేమీ యెక్కువ కోరలేదు. కాని మాకంత తాహతు వుందా అని యోచిస్తున్నాను.

కోటమ్మ—నీతాహతు నీమేడే చెబుతోందిరా.

వెంకటశాస్త్రి—మీసాలపెరుగులాగ పైకి మేడ కనుపడుతోం దందరికీనీ. అయితే: యేంచదువుతు న్నావురా యిప్పుడూ?

వెంకన్న—శబ్దాలు నేర్చుకుంటాను, కోతలయి పోయాక. నేను కూడా రాజమండ్రీలోనే వుంటాను యికముందు, పురాణాలు చెబుతూనూ.

వెంకటశాస్త్రి—ఇదివరకేం చదివావూ?

వెంకన్న—రెండో కళాసు.

వెంకటశాస్త్రి—ఎన్నో యేడే నీకొడుక్కి?

కోటమ్మ—పద్ధెనిమిది వెళ్లాయి. దాచుకోడం యెందుకూ?

(వెంకటశాస్త్రి కాంతమ్మకేసి చూస్తాడు. ఆమె మందహాసం చేస్తుంది.)

కోటమ్మ—(స్వగతం) యెన్నివిధాల పోరినా వెవసాయంలో ప్రవేశపెట్టారు; గాని చదువుకో నిచ్చారా తండ్రీ? ఇంగిలీసులో ప్రవేశపెడితే యీపా టికి యెప్ఫే అయిపోవును.

వెంకన్న—(స్వగతం) శ్రద్ధపడితే శబ్దాలెంతా? శబ్దాలువస్తే కావ్యాలు పేలాప్పిండే.

కోటమ్మ—ఇప్పుడు చదువులెవరూ చూడ్డం లేదే మరదలా! నేల వుంటేగాని యీకాలంలో పెళ్లి కావడంలేదు మొగపిల్లలికి. ఎంతచదువుకున్నా నేల లేక పోతే వాడు గుటుక్కుమన్నాడంటే యిక పిల్లకి గతేదీ? మావూళ్లో కరణాలు యిలాగే చదువు మాసి యిచ్చాటప్పటికి పెళ్లయిన నాలుగునెల్లకి చచ్చివూరు కున్నాడు పెళ్లికొడుకు. ఇప్పుడాపిల్లకి మనువర్తికేనా దారిలేదు.

వెంకటశాస్త్రి—సెబాస్!

కాంతమ్మ—(స్వగతం) చివరికి మంచిధోరణి లోనే పడుతోంది. యింకా మాట్లాడనిస్తే యింతకంటే పాడుమాటలు వస్తాయి. (ప్రకాశం) ఆలోచించి చెబు తారులే వొదినా!

వెంకటశాస్త్రి—అలా చేద్దామే అక్కయ్యా!

కోటమ్మ—పిల్లతరవాత యిబ్బంది—

వెంకటశాస్త్రి—ఆలోచించి చెబుతామన్నాను గామా? యింక అధికంగా ప్రసంగం యెందుకూ?

కోటమ్మ—అలాగే ఆలోచించుకోండి. నుంచున్నపాళంగా చెప్పడానికి—మీరుమాత్రం ఆలోచించుకోవద్దా? ఏమయినా నేను పెద్దాడబడుచుని గదా? పుట్టినప్పణ్ణుంచీ బంగారం నా కోడలంటూనే వున్నాను నేను.

వెంకటశాస్త్రి—సరే.

కోటమ్మ—గోదావరివొడ్డున మావూరి కరణాల పిల్ల వుంది. చూసివస్తాను భోజనాలవేళకి. ఈ లోపుగా మీరు బాగా ఆలోచించుకోండి.

వెంకటశాస్త్రి—వెళ్లి రా.

కోటమ్మ—అంటూ సొంటూ లేని సమ్మంధం కదా? మీస్థితీ, మా తాహతూ, మా యిదీ మీరు—

వెంకటశాస్త్రి—వెళ్లిరమ్మన్నాను కాదూ?

వెంకన్న—యీవూళ్లో శబ్దాలు బాగా చెప్పగలవాళ్లున్నారా మామయ్యా?

వెంకటశాస్త్రి—నీకు చెప్పగలవాళ్లు యీ వూళ్లోనే గాదు, సాధారణంగా యెక్కడా కూడా—యింతకీ, నువ్వు చదువుకోసం రాగలిగేటప్పటికి ఆవేళ కెక్కణ్ణుంచో యెవడో వొకడు వూడిపడకపోతాడూ?

వెంకన్న—భక్తిశ్రద్ధలతో చెప్పేవాళ్లని కాస్త చూస్తూవుండు.

కోటమ్మ—యిక తండ్రిపెత్తనం యెలాగా సాగనివ్వను. యింగ్లీషు లేకపోతే లేకపోయింది, మన వేదమ్మక్కలేనా చెప్పిస్తేగాని బాగాలేదు. మంచి గురువుని చూసిపెట్టు. యిక వాడిబాధ్యతఅంతా నీదే.

వెంకటశాస్త్రి—కూతుర్నివ్వడం వచ్చినప్పుడు అది వేరే చెప్పాలా?

కోటమ్మ—రారా నాయనా!

వెంకన్న—మామా! వెళ్లివస్తాను. అత్తా! వెళ్లివస్తాను.

(కోటమ్మా, వెంకన్నా వెళ్లిపోతారు. వెంకటశాస్త్రీ, కాంతమ్మా వొక్కక్షణం వొకర్నివొకరు గంభీరంగా చూసుకొని ఫక్కున నవ్వుతారు.)

కాంతమ్మ—యిలాంటి సమ్మంధం యిక దొరకదు.

వెంకటశాస్త్రి — సందేహమేమిటి? అల్లుడు పొరుగింటికి వెడుతూ మన యిద్దరితోటీగూడా చెప్పాడు చూశావా?

కాంతమ్మ—భయభక్తులెక్కువ——.

వెంకటశాస్త్రి—వీడికి భక్తిశ్రద్ధలతో శబ్దాలు చెప్పే గురువు కావాలిట. పైగా యికముందు పురాణాలు చెబుతూ యీవూళ్లోనే వుండిపోతాడుట, విన్నావా?

కాంతమ్మ—మామగారోవీధినీ, అల్లుడోవీధినీ పురాణాలుచెప్పి దోచెయ్యవచ్చు. దాటిపోనివ్వకండి.

వెంకటశాస్త్రి—బాగా కనిపెట్టావు.

కాంతమ్మ—కనక పిల్లనివ్వండి. లేకపోతే—పెద్దాడబడుచూ, లోకం హర్షించదు.

వెంకటశాస్త్రి—నీకిష్టమేగదా?

కాంతమ్మ—యెంత అందంగానో వుంది.

(అప్పుడు బంగారమ్మ వస్తుంది.)

బంగారమ్మ—ఏమే అమ్మా! వాళ్లేరీ?

కాంతమ్మ—సమ్మంధం నిశ్చయమైపోయింది. వాళ్లు వెళ్లిపోయారు.

బంగారమ్మ—(బిక్కమొగంతో కిందకి చూస్తుంది.)

వెంకటశాస్త్రి—ఏంతల్లీ? (కాంతమ్మకేసి తీక్ష్ణంగా చూసి) యిలారా అమ్మా! (చేతులు చాపుతాడు.)

బంగారమ్మ—(నుంచునే వుండి మాట్లాడదు. కళ్లల్లో గిర్రున నీళ్లు తిరుగుతాయి.)

కాంతమ్మ—ఏం తల్లీ! ఏంమామ్మా! (అని లేచివెళ్లి, పొదివిపట్టుకొని) లేదమ్మా! నిన్నతని కిస్తామా? బెంగపెట్టుకోకమ్మా.

వెంకటశాస్త్రి—అదేమిటమ్మా! వెట్టిదానా! నిన్ను ఆవాజమ్మకిస్తానా? (కాంతమ్మతో) అమ్మాయిని నువ్వేడిపించావు.

కాంతమ్మ—వూరికే అన్నానండీ, చిట్టితల్లి యేమంటుందో అనీ. లేదమ్మాలేదు. వూరుకో మాతల్లీ! వాళ్లని వచ్చినదారినే పొమ్మంటాములే. (బంగారమ్మ కళ్లు తుడుస్తుంది.)

(అప్పుడు పేరుభట్టు వస్తాడు.)

పేరుభట్టు—ఏంచేస్తున్నావు మామయ్యా?

వెంకటశాస్త్రి—ఏమీలేదు కూచోరా.

కాంతమ్మ—కూచోవోయి! బావ వచ్చాడు చూడు తల్లీ!

బంగారమ్మ—(తల వంచుకొని కుమిలికుమిలి దుఃఖిస్తుంది.)

పేరుభట్టు—ఏంమామా! ఏమిటత్తా అదీ? అదేమిటి బంగారం? (దగ్గిరికి వెడతాడు.)

(బంగారమ్మ పేరుభట్టుదగ్గిరికి వెడుతుంది. అతనామెని పొదివిపట్టుకొని ఆమె "అలా పద" అనగా మేడమెట్లెక్కి పైకి తీసుకు వెడతాడు.)

కాంతమ్మ—చూశారా?

వెంకటశాస్త్రి—ఏమంటావు?

కాంతమ్మ—ఏమిటంటారూ?

వెంకటశాస్త్రి—కష్టమూ సుఖమూ, మంచీ చెడ్డా తెలిసే వయస్సూ. పైగా అమ్మాయి నిశితప్రతిభావంతురాలు.

కాంతమ్మ—వెంకన్నని చూసి దిగ్గున లేచిపోయింది. పేరుభట్టుని చూసి దగ్గిరికి చేరింది.

వెంకటశాస్త్రి—కనిపెట్టావుగదా? మనస్సులో వుంచుకో.

కాంతమ్మ—మీ పెద్దక్కా, వెంకన్నా యిక్కణ్ణుంచి వెళ్లిపోయేదాకా అమ్మాయి అన్నం ముట్టదు. వాళ్లున్నంతసేపూ అది యింటోనే వుండదూ. తొరగా పంపెయ్యండీ, యేదోచెప్పి వాళ్లని.

వెంకటశాస్త్రి—రాత్రిబండిమీదే పంపేస్తాను. (చిటికలువేస్తూ) తొరగా వంటకానియ్యి.

కాంతమ్మ—నిప్పురాజేశానంటే క్షణం. వేపుడు కూరలా, పిండివంటలా?

వెంకటశాస్త్రి—(లేచి నుంచుని) పన్నెండేళ్ల పిల్ల. పాతికేళ్ల వాడికేనా మొగాడికి వుండదింత బుద్ధి. సెబాస్! యిలాంటి కూతురుండగా యిక కొడుకుల్లేరని విచారం యెందుకూ? (వీధిలోకి వెళ్లిపోతాడు.)

కాంతమ్మ—చిట్టితల్లి యెంత నాజూకుమనిషీ! తారతమ్యం పెద్దవాళ్లేనా కనిపెట్టలేరింతగాను. గాజురాయేదో, రత్నం యేదో విడమర్చేసింది క్షణంలోను. వాళ్లు వచ్చినప్పణ్ణుంచీ అది యెలాగో వుంది. యేం చెప్మా అనుకున్నాను గాని కనిపెట్టలేకపోయాను. నేను బతిమాలినా, తండ్రి వోదార్చినా పోనిదుఃఖం దానికి పేరుభట్టుని చూశాటప్పటి కేమయిపోయిందో గాని—పేరుభట్టూ అలాంటివాడే పాపం. బిడ్డ విచారంగా వుండడం చూశాటప్పటికి చివుక్కుమం దతని మనస్సు. ప్రాణం యిస్తున్నాడు బంగారం అంటేను. వారి కభిమానం వున్నట్టుంది. నేను కాదనను. చిట్టితల్లి వూహ యెలా వుంటే అలా నడుస్తాను.

(లోపలికి వెళ్లిపోతుంది.)

మూడోరంగం

[పేరుభట్టుగది. భద్రయ్యా అనే సహాధ్యాయి కూచునివుంటాడు.]

భద్రయ్య—యేమిటి గతి? భవిష్యత్తంతా అయోమయంగా వుంది. ఆరుమాసాల్లో యింటావిడ సిద్ధం. గిన్నెలు కాకపోతే కుండలతో వండుకుందామన్నా బియ్యపునూక లెలావస్తాయి? సాహిత్యంలో బుద్ధి

పాకిపోతోందన్న సంబరమేగాని ముందు సంసారం చెయ్యడం యెలాగా అని యింతవరకూ ఆలోచించనైతిని. డబ్బుసంపాదించే లక్షణాలు యేమీ పట్టుపడలేదు. అమాంతంగా సంసారం మీదపడిపోతే అప్పుడేమిటి చెయ్యడం?

వా! ప్రయోజకుడెవరూ అంటే పేరుభట్టుని చెప్పవయ్యా! పాటలో అంతవాడు యీ పట్నంలో మరివొకడు లేడుకదా? పేరుభట్టుగారి పాటంటే సభ నిండిపోతుంది కదా? వూరికే పాడినా యేవో బహుమతీలు వొస్తూనేవుంటాయి. మహా మృదువైన గాత్రం. అతను తరుచు పీడర్లతో సార్టుబళ్లమీద తిరుగుతూవుంటే నాకు సంతోషమే; కాని విద్యార్థిగాళ్లంతా అలా యేడుస్తారెందుకూ? వాళ్ల సామ్మేం పోయిందీ, అతను పూర్వజన్మంలో చల్లాడు. యిప్పుడు పండుతోంది. నేను చల్లకుండానే పండాలని కోరుతున్నాను.

ఆరునెల్లు ఆక్టింగయితే అయింది, హితకారిణీ హైస్కూల్లో తెలుగుపండితుడుగా చేరదామంటే గురువుగారు గూడా దానికి రహస్యంగా ప్రయత్నాలు చేస్తున్నారుట, యేమిటిదారి? నిజానికి వారూరుకో వలిసింది. దగ్గిర పదిరాళ్లు వున్నాక బీదవాళ్లమీదకి పోటీయెందుకూ? మొదట నన్ను ప్రోత్సాహంచేసింది వారేఆయె. అయినా, పడుచుపెళ్లాం పోరుతూవుంటే ఆయన యేంచెయ్యగలరూ?

సాహిత్యంవిషయంలో తోటి విద్యార్థిగాళ్లకందరికీ మొనగాణ్ణే. అయితో వొకటి తోచిందికాదు. పేరుభట్టు యీవూరు వచ్చినప్పణ్ణుంచీ—స్నేహం కలిసినప్పణ్ణుంచేనా శ్రద్ధచేస్తే యీపాటికి పదిరాగాలు రాకపోవునా? సాహిత్యానికి తోడు కాస్త రాగజ్ఞానం వుంటే హరికథలు చెప్పుకొని వకరుగా బతకవచ్చునే! తుదకిపురాణంచెప్పినా పదిరాళ్లూ దొరుకును, గౌరవంగానూవుండును. పేరుభట్టు మేనమామ పురాణం చెప్పేగామూ, దోచేస్తున్నాడూ?

నిజంగా నేను ప్రపంచకాన్ని కనిపెట్టలేకపోయాను...... ఇప్పుడయితేమాత్రం యేం? పేరుభట్టు నాకోరిక తిరస్కరించడు. నేను సంస్కృతాభ్యాసంలో సాయపడుతున్నాను గనక తప్పకుండా చెబుతాడు. నేను తనకేమీ అడ్డురానుకదా? రానియ్యి, మాట్లాడుదాం.

(అప్పుడు సూరన్న వస్తాడు)

సూరన్న—అయ్యా! పేరుభట్టనే విద్యార్థి నెరుగుదురా మీరూ?

భద్రయ్య—యెరక్కేమి?

సూరన్న—వాడిబస యెక్కడండి?

భద్రయ్య—ఇదే.

సూరన్న—వున్నాడా?

భద్రయ్య—వొకప్లీడరుగారి కూతురికి సంగీతం చెప్పడానికి వెళ్లాడు. వచ్చేవేళయింది. మీ దేవూరండి?

సూరన్న—వాడు మాతమ్ముడే.

భద్రయ్య—అలాగా? దయచెయ్యండి.

(సూరన్న వచ్చి కూచుని వొకమాటు గదిఅంతా పారచూశాడు.)

సూరన్న—మావాడూ మీరూ సహాధ్యాయులా?

భద్రయ్య—సహవాసులం. వొకరిదగ్గిర చదువుకుంటున్నాం కూడానూ.

సూరన్న—ఈగదికి అద్దెయెంతండి?

భద్రయ్య—అయిదు రూపాయలు.

సూరన్న—యిద్దరూ పెట్టుకుంటారా సమానంగాను?

భద్రయ్య—నేనేమీ యివ్వలేనంటే మీ తమ్ముడు స్నేహరీత్యా "రావోయి" అన్నాడు,

సూరన్న—(స్వగతం) డబ్బంతా యిలా తగలేస్తున్నాడన్నమాట వీడు. (ప్రకాశం) ఈగదివిచిత్రపటాలెవరివండి? ఈట్రంకు పెట్టే, ఈపెద్దద్దమూ, ఈ

పరుపూ, ఈమడతమంచమూ, యీ బట్టలబీరువా, ఈ మడతకుర్చీలూ—

భద్రయ్య—నేను బీదవాణ్ణని ముందే మనవి చేసుకున్నాను. అన్నీ మీ తమ్ముడివే. ఆరైలుసంచీ మాత్రమే నాదీ.

సూరన్న—విద్యార్థిగాడి కింతవేషం యేమిటండీ ?

భద్రయ్య— వూరికే వస్తే పుచ్చుకోవద్దన్నారా?

సూరన్న—సంపాదించడం మంచిదే; కాని వారాలు చేసుకునీవా డింతవేషంవేస్తే చూసినవాడు వారం యిస్తాడా ? దొరికిందల్లా వీలయినప్పు డింటికి పంపేస్తే మళ్లీ యెవళ్లనేనా అడగడానికీ, సంపాదించడానికీ బాగుంటుంది. ఏమంటారు ?

భద్రయ్య— మీరుచెప్పింది సర్వోత్తమంగా వుంది ; గాని మీవాడు ఆమాత్రపు మనిషి కాడండి.

సూరన్న—నిజంచెప్పారు. అయితే మీరెందు కూ్కకలేశారు కారూ ?

భద్రయ్య—తోచిందికాదు. ఇక చెబుతాను.

సూరన్న—అయితే మావాడు యిలాగ వేషాలు వెయ్యడమేనా, యేమేనాడబ్బు—

భద్రయ్య—విద్యార్థిగాళ్లకి సంపాదనఅంటే యేమిటీ ? ఇలాంటి పట్నంలో వారాలు దొరకడమే కష్టం. యింతకీ మీతమ్ముడు సంగీతపాటకుడు గనక—

సూరన్న—చూడండీ. విద్యార్థి గాళ్లలో మాత్రం సంపాదించేవాళ్లు లేరూ ? నిజానికి విద్యార్థిగా వున్నప్పుడు సంపాదించలేనివాడు తరవాతా సంపాదించలేడు. నేను మాత్రం చదువుకునేటప్పుడు మూతిబిగించుకూచ్చోలేదు సుమండీ ; కాని మావాడిలాగ కాక దొరికిందల్లా యింటికి పంపేసి మళ్లీ తయారయ్యేవాణ్ణి.

భద్రయ్య—మీరు సంసార రాజులన్నమాట ; కాని నోరుచేసుకొని మీవా డెవణ్ణీ అడగలేడండీ.

సూరన్న—మరి యివన్నీ యెలా వచ్చాయీ ?

భద్రయ్య—(స్వగతం) జలగలాగ పట్టుకున్నాడే! వీణ్ణి బోల్తాకొట్టించడం యెలాగా ?

సూరన్న—ఏమిటో ఆలోచిస్తున్నారు. నిజం చెప్పండి.

భద్రయ్య— అదేమిటండోయి, అలా సెలవిస్తున్నారు. అబద్ధాలు చెబితే నాకేం వస్తుందీ ?

సూరన్న—అదికాదు. మీరు పొరబడుతున్నారు—

భద్రయ్య—బాగుండండోయి మహానుభావా ! నాది పొరపాటూ, మీది వాస్తవమూనా? అలా అన్నారేమిటండీ ?

సూరన్న—నేనేమన్నానూ, యిప్పుడు తథావస్తుమాటా ?

భద్రయ్య—ఘట్టిప్రశ్నే వేశారు; కాని నాకు తీరుబడిలే దిప్పుడు. యింకా పాఠంచూసుకోవాలి కూడానూ. నేనవతలికి వెడతాను. మీరు కూచునివుండండి. మీవాడు వస్తూవుంటా డీపాటికి.

సూరన్న—ఆ కష్టం మీకెందుకూ ? ఈగదిలో నుంచి మిమ్మల్ని అవతలికి వెళ్లమనడానికి నాకేం అధికారంవుందీ ? బజారుకివెళ్లాలి. మళ్లీ అరగంటలోపుగా వస్తాను. మావాడు వస్తే యీమాట చెప్పి, వుండమని చెప్పండి. (లేస్తాడు.)

భద్రయ్య—అవశ్యమూనూ.

సూరన్న—(వెడతూ) తేలేపోయింది. పేరిగాడేమాత్రమో సంపాదిస్తున్నాడు. వీడికి తెలుసు నా సంగతి. కాని దాచాడు. వెఱ్ఱిమొఘం. అడిగినదానికి సూటిగా జవాబు చెప్పకపోవడమే అడిగింది వొప్పుకోడంకాదూ ? పేరిగాడిదగ్గిరవున్నది—ఈసామానులో కూడా కొంత పట్టుకుపోవాలి. (వెళ్లిపోతాడు.)

భద్రయ్య—శనిలా వున్నాడే. కొంపలు కూల్చే రకం. వీడికి నేను లొంగుతానూ! హిహ్హి.

(పేరుభట్టు వస్తాడు.)

భద్రయ్య—వచ్చావా? కూచో. నీకోసం పోలీసు వచ్చాడోయి!

పేరుభట్లు—సర్కిల్ ఇనస్పెక్టరుగారు పంపించారు కాబోలు. నెల్లాళ్లనుంచి పోరుతున్నాడాయన తనయింటో పాడమనీ.

భద్రయ్య—అది గాదోయి పప్పా. దొంగ పోలీసు.

పేరుభట్లు—అంటే?

భద్రయ్య—నీసంపాదన యెలావుందో, నీదగ్గిర యేమాత్రం నిలవవుందో, సొమ్ము యేంచేస్తున్నావో, యీ పరుపూగిరుపూ యేలావచ్చాయో—

పేరుభట్లు—అర్థంలేనిమాటలు—

భద్రయ్య—నిజమే. మళ్లీవస్తాదులే కూచో. నిన్ను వుండమని చెప్పమన్నాడుకూడానూ.

పేరుభట్లు—ఏమిటోయి నీగడబిడా?

భద్రయ్య—హహ్హాహ్హా. కూచో ముందు. మీ అన్నయ్యట—

పేరుభట్లు—ఏ అన్నయ్యా? పేరు—

భద్రయ్య—అడుగలేదు. పళ్లు పొడుగూ.

పేరుభట్లు—వాడా? మా చిన్నన్నయ్య. నిలువునా విషమూ. ఏమన్నాడేమిటి?

భద్రయ్య—యీగదికి అద్ది యెంత? నువ్వు చెరిసగమూ యిచ్చుకుంటున్నావా లేదా? యిలాగ గుక్క తిప్పుకోకుండా వూదరగొట్టేశాడు.

పేరుభట్లు—యిదంతా తనకెందుకూ?

భద్రయ్య—సంపాదించిందల్లా యింటికి పంపేస్తే గతిలేదు బాబోయని మళ్లీ ముట్టెత్తుకోవచ్చుట. తను అలాచేసేవాడుట.

పేరుభట్లు—వాడిమొఖం. వాడు చదువుకునేటప్పుడింటికి పంపడానికి సంపాదన అంటూ వుంటేనా? కట్టుకునేబట్టలుకూడా యింటిదగ్గిర్నుంచి పట్టుకుపోయీవాడు. యెప్పుడో వొకమాటు వొకపట్టురైక మాత్రం తెచ్చి మాఅమ్మకిచ్చా డెలావచ్చిందో గానీ.

భద్రయ్య—బాగుంది; కాని మంచిప్రశ్నలు వేస్తాడోయి!

పేరుభట్లు—నీవంటి వెఱ్ఱిపెద్దమ్మ దొరికితే వెయ్యకేం? రానీ నన్నడిగితే నేనేం చెబుతానో విందువుగాని.

భద్రయ్య—పాఠం మానేస్తా నయితే.

పేరుభట్లు—అది నీయిష్టం. మా తగువులు వింటూ కూచోడం లాభమో, పోయి పాఠం చెప్పుకోడం లాభమో ఆలోచించుకో.

భద్రయ్య—మహా బాగా కొట్టావుదెబ్బ. అవునవును. వొకళ్ల గృహచ్ఛిద్రాలింకోడు వినడం తప్పే. అయితే: ఇవాళ నాటకంలోకి వెడతావు కాదూ నువ్వూ?

పేరుభట్లు—తప్పకుండానూ.

భద్రయ్య—నన్నుకూడా తీసుకువెళ్లాలి సుమా.

పేరుభట్లు—అలాగే.

భద్రయ్య—టిక్కట్టు లేకుండాసుమా.

పేరుభట్లు—డబ్బు ఖర్చులేకుండా తీసుకువెళ్లగలను; గాని టిక్కట్టు లేకుండా నావల్లగాదు.

భద్రయ్య—వాయించేశావే! (యెదటచూసి) అదిగో మీఅన్నగారు వస్తున్నారు. (గదిలోనుంచి వీధిలోకి వస్తాడు.)

(అప్పుడు సూరన్న వస్తాడు.)

సూరన్న—వాయించేశా వంటున్నా రేమిటండోయి?

భద్రయ్య—మిమ్మల్ని కాదు. అదిగో మీ తమ్ముడు. వెళ్లండి. (వెళ్లిపోతాడు.)

(పేరుభట్లూ, సూరన్నా వొక్కక్షణం గంభీరంగా చూసుకొంటారు.)

సూరన్న—యెక్కడికి వెళ్లావురా?

పేరుభట్టు—వొకపిల్లకి పాఠంచెప్పడానికి.

సూరన్న—నెలకి యేమిస్తారూ?

పేరుభట్టు—యెనిమిదీ.

సూరన్న—యిలా యిచ్చేవాళ్లెంతమంది వున్నారూ?

పేరుభట్టు—యీవొక్కపిల్లే.

సూరన్న—ఇంతే?

పేరుభట్టు—అంటే?

సూరన్న—మొత్తానికి సంగీతం యెంతమందికి చెబుతున్నావూ?

పేరుభట్టు—ఎందుకేమిటి?

సూరన్న—నేనామాట అడిగితే తప్పా?

పేరుభట్టు—నేనీమాట అడిగితే మాత్రం తప్పాయేమిటి?

సూరన్న—బాగానేవుంది. యింతకీ: అదంతా నాకెందుకూ. నీ. వొకకోకా, వొకఆడకట్టుజమారూ, రెండు పరికిణీలూ కావాలిట. రూపాయలేమేనా ఇవ్వాలి.

పేరుభట్టు—యెక్కడతేనూ?

సూరన్న—యెక్కడేనా తేవాలి. లేకపోతే సంసారం యెలావెడుతుందీ? ఆభారం అంతా నేనొక్కణ్ణీ మొయ్యగలనా?

పేరుభట్టు—నువ్వు మోసేదేమిటోయి?

సూరన్న—అంటే యేమన్నమాటా?

పేరుభట్టు—శిస్తేమవుతోందీ?

సూరన్న—సముద్రంలో కాకిరెట్ట. పెత్తనం చేస్తే తెలుస్తుంది. మాటలుచెప్పడంకాదు.

పేరుభట్టు—నువ్వు తప్పుకో పోనీ. మళ్లీకలిసి అంతా పెద్దన్నయ్య చక్కబెడతాడు.

సూరన్న—అయితే మూడోమేలు ఇంతకంటే వుందీ?...అలాంటిమొగాలే సంసారాలు దిద్దడం?

పేరుభట్టు—మళ్లీఆనాలికమడతమాట యేమిటీ?

సూరన్న—వొకొక్కొక్క తవ్వాయి వచ్చినప్పుడు నేను పడీపాట్లు దేవుడికెరుక. దానికేంగానీ, అసలే యేమీలేదంటే యెలాగా? పోనీ, పదిరూపాయలు తే.

పేరుభట్టు—దమ్మిడీకూడా యివ్వలేను.

సూరన్న—యీసామానంతా యెలా వచ్చిందీ? పట్టంచుల చాపు కట్టావు. సిల్కుచొక్కా తొడిగావు. నేలంకండువా పైనవేశావు. డబ్బంతా యిలా పాడుచేస్తూ—

పేరుభట్టు—మహా పోషిస్తూవున్నవాడిలాగే పరీక్షచేస్తున్నావే?

సూరన్న—యివన్నీ యిలా యెదురుగా పెట్టుకూచోకపోతే యింటిక్కి పంపెయ్యరాదూ?

పేరుభట్టు—నాకోమరి?

సూరన్న—మళ్లీ సంపాదించు.

పేరుభట్టు—మంచి సలహాయే. నాకు తోచింది కాదు. యిదివరకే యెందుకు చెప్పావుకాదూ మరీ?

సూరన్న—చెప్పాలీ వొకరూ?

పేరుభట్టు—అందరికీ నీకున్నంత ప్రతిభ వుంటుందా?

సూరన్న—అయితే నువ్వు చిన్నమామతోటీ వాళ్లతోటీ మాట్లాడ్డం లేదుగదా? వాళ్లయింటికి వెళ్ల వద్దు నువ్వు. అమ్మ గట్టిగా చెప్పమంది యీమాట నీతోటి.

పేరుభట్టు—వాళ్లమాట యెందుకు వచ్చిందీ?

సూరన్న—నువ్వీవూళ్లో వున్నావుకనకా. ఆపయిని నీయిష్టం. అమ్మ చెప్పమన్నమాట చెప్పాను.

పేరుభట్టు—నీపని తీరిపోయిందిగదా?

సూరన్న—రూపాయలమాటో మరీ? అమ్మ పదిమాట్లు చెప్పింది.

పేరుభట్టు—చదువుకొనేవాడిదగ్గిర డబ్బేం వుంటుందీ? యెలా వస్తుందీ? నువ్వెక్కడికేనా వెళ్లి సంపాదించరాదూ?

సూరన్న—యిల్లు కదలడానికి వీలా నాకూ? పిల్లలు తుమ్ముతారు. దగ్గుతారు. మూసేవాళ్లెవరూ?

పేరుభట్టు—పిల్లలు నీకొక్కడికే వున్నారా? పెద్దన్నయ్య యెలా వెడుతున్నాడూ?

సూరన్న—వొదిన భయంలేని మనిషి. మీచిన్న వొదిన వొట్టిబేలమనిషి. నువ్వెరగవా యేమిటి?

పేరుభట్టు—జమాఖర్చురాస్తే తగిలీదంతా పెద్దన్నయ్య పెట్టుకుంటూ నన్నాడు గదా—

సూరన్న—దాటెయ్యడాని కదో యెత్తూ. లెక్కలుపెట్టకపోతే, నేను హరిస్తున్నాననుకున్నావా, లెక్క రాయడం నాకు చేతకాదనుకున్నావా. సంసారంగుట్టు చెడిపోతుందని గాని.

పేరుభట్టు—జమాఖర్చులు రాస్తే గుట్టెలా చెడిపోతుందీ?

సూరన్న—లెక్కలు మొదలు పెట్టామంటే పెద్దాడు వాళ్లనీ, వాళ్లనీ తీసుకువచ్చి, మాటిమాటికీ చూపించమంటాడు.

పేరుభట్టు—కుటుంబమర్యాద వాడికి తెలవదూ?

సూరన్న—ఆసంగతంతా నీకేతెలుసు. పోనీ, బట్టలు అరువేనా యిప్పించు. వూళ్లో వర్తకులందరూ నీకు స్నేహితులుట.

పేరుభట్టు—దైవానుగ్రహంచేత స్నేహితులికీ లోటులేదూ, అరువూ పుడుతుంది; గాని ఆబాకీ నువ్వు తీరుస్తావా?

సూరన్న—ఈవూళ్లోవుండి నువ్వేంచేస్తావూ?

పేరుభట్టు—అయితే కోకయెవరికీ?

సూరన్న—మీ చిన్నవొదినికి.

పేరుభట్టు—నీపెళ్లానికి నేనెందుకొక్కనాలీ?

సూరన్న—సంసారంఅంతా నేను మొయ్యడం లేదూ?

పేరుభట్టు—యెవ రెవరిసంసారం మోస్తున్నావోయి?

సూరన్న—అంతానూ.

పేరుభట్టు—పెద్దన్నయ్య వేరున్నాడాయె. నేనూ, తమ్ముడూ యెప్పుడూ యింటోనే వుండడం లేదాయె. యిక నువ్వూ, నీపెళ్లామూ, నీపిల్లలూ—

సూరన్న—ముసలిదీ, చెల్లెలూనో?

పేరుభట్టు—ఆస్తి వాళ్లకి వదిలేసి పెద్దన్నయ్యలాగే నువ్వు పైగాపో.

సూరన్న—పెద్దాడు తనకి పడీధాన్యం వుమ్మట్లో నుంచి తీసుకోడం లేదూ?

పేరుభట్టు—నేను మానిపిస్తాను.

సూరన్న—ముసలిదాన్నీ, పెళ్లిగాని చెల్లెల్నీ మీలాగే వదిలెయ్యనా? అదంతా నాకు తెలవదు. అమ్మ బట్టలు కావాలని నీతో చెప్పమంది. నేను చెప్పాను. నువ్వుచెప్పిన సమాధానాలు అమ్మకి చెబుతాను. నాకేం?

పేరుభట్టు—అమ్మ నాబుఱ్ఱ తీసేస్తే అప్పుడు చూద్దాంలే.

సూరన్న—అయితే: నేను వెడుతున్నాను. చిన్నమామగారియింటికి వెళ్లడంగాని, వాళ్లతో మాట్లాడ్డంగాని చేశావుసుమా. యిప్పుడు డబ్బులేకపోతే యింటికి వచ్చాటప్పుడేనా కొనిపట్టుకురా బట్టలు. పరికిణీలు మానేసినా, ఆడకట్టుజామారూ, మూడో నాలుగో పెడితే వస్తుంది, వొకచీరా పట్టుకురా. మరిచిపోకు సుమా.

పేరుభట్టు—చెల్లికి పరికిణీలక్కర్లేదా?

సూరన్న—డబ్బుంటే పట్టుకురా.

పేరుభట్టు—మరి అలా అన్నావేం? కోక మానేసి పరికిణీగుడ్డలు తెస్తేనో?

సూరన్న—నీయిష్టం. యెలా చేసినా సరే. నువ్వు తేకపోతే కుటుంబఖర్చులకోసం రుణంచేస్తాను. నాకేం? (వెళ్లిపోతాడు.)

పేరుభట్టు—(స్వగతం) తేలిందా? యిలావుంది వీడిసంగతి. మాఅమ్మకి యేమీ తెలవడం లేదు. చిన్నబ్బా

యంటే సత్యహరిశ్చంద్రుడనుకుంటోంది ..... రుణాలు పెరిగితే పెరిగాయి. నేను నావాటా వదులుకుంటాను. దిక్కుమాలిన తగువులు నాకు పనికిరావు. ఫిడేలే నాకు ఆస్తి.

(తెర దించవలెను)

నాలుగోరంగం

[పేరుభట్టు గది. గోడకానుకొని పేరుభట్టూ, పక్కని భద్రయ్యా కూచునివుంటారు. పేరుభట్టు యెదట ఫిడేలు గోడుగావుంటుంది.]

పేరుభట్టు—శ్రద్ధచేస్తే ఆరునూసాలు చాలు. పురాణానికి సంగీతం ఆట్టే అక్కర్లేదు. సంగీతం వస్తేనూ, సాహిత్యం వుంటేనూ పురాణం చెప్పడం సాధ్యంకాదు. ఆకళ వేరూ.

భద్రయ్య—సంగీతంలేకపోతే పద్యంలో వున్న గాంభీర్యమే పోతుంది. పద్యానికి రాగమే ప్రధానం.

పేరుభట్టు—రాగం అంటే బొమ్మలాటలోనూ వుంటుంది. భాగవతంలోనూ పాడతారు. నాటకాల్లోనూ, హరికథల్లోనూ కూడా పాడతారు. సంగీతకచేరీలలో సరేసరి. యిందులో—

భద్రయ్య—పురాణరాగాలు వేరోయి!

పేరుభట్టు—అంటే యేమన్నమాటా? ఆధోరణి సహజంగా కలగాలి గాని; సంగీతం నేర్చుకుంటే రాదు. అయితే: మొన్న నువ్వు ప్రభలవారియింటో సత్యనారాయణవ్రతకల్పం చెప్పినప్పుడు విన్నాను. కొంచెం శ్రద్ధ చేస్తే పురాణం బాగానే చెప్పగలుగుతావు.

భద్రయ్య—యేలాగో నాలుగురాగాలు కాస్త శ్రావ్యంగాపాడడం నేర్పితివా, నాకు జీవనాధారం కలిగించినవాడవౌతావు.

పేరుభట్టు—అది భగవంతుడే యేర్పరిచాడు. పురుషకారంవల్ల ఆ వరం స్వాధీన మవుతుంది. వున్న చిక్కల్లా యేమిటంటే? ప్రతీవాడూ తనకి నచ్చిన వృత్తిలో దిగబోతాడు. దాల్లో వాడికి బుద్ధి ప్రవేశించక పోవచ్చు. అలాంటప్పుడే మనవాళ్లు దైవాన్ని నిందిస్తారు. నీకు పురాణంచెప్పి డబ్బు సంపాదించాలని వుంది; గాని అందులో నీబుద్ధి ప్రసరించకపోతే—

(తెరలో)

పేరుభట్టుగారూ!

పేరుభట్టు—వుత్తరాలుంటే కిటికీలో నుంచి పడెయ్యవోయి!

(వొకకవరు కిటికీలోనుంచి పడుతుంది. పేరుభట్టు విప్పి చదువుకుంటాడు.)

భద్రయ్య—రహస్యమా యేమిటి?

పేరుభట్టు—నాకు రహస్యాలేమిటోయి! కాకినాడలో గానసభ అవుతోంది. గాయకురాలు మెడ్రాసు నుంచి వచ్చింది. నాలుగుకచేరీలు గుత్త. మొన్న వొకటి జరిగింది. ఫిడేలుగాడు జ్వరపడ్డాడు. నన్నురమ్మనీ. వెడితే వెళ్లడమే. లేకపోతే తంతికొట్టాలి. కచేరీ వొక్కటికి యెనభైరూపాయ లిస్తారుట.

భద్రయ్య—వెడతావా యేమిటి?

పేరుభట్టు—రెండువందల నలభైరూపాయలు చేదా, విషమా?

భద్రయ్య—బోగందానిపక్కని హంగు—

పేరుభట్టు—అదేం మాటోయి?

భద్రయ్య—ఏమీ?

పేరుభట్టు—ఇది విద్య చూపించడమోయ్!

భద్రయ్య—బోగంది భాగోతం కడుతూవుంటే పక్కని తిత్తివూదడమూ, తాళం వెయ్యడమూ—

పేరుభట్టు—ఎంత చక్కని పోలిక తెచ్చావూ?

భద్రయ్య—అంతకంటే యిది యేవిధంగా మంచిదీ?

పేరుభట్టు—బ్రాహ్మడు తాలూకాకచేరీలో డవాలీపని చెయ్యవచ్చునా?

భద్రయ్య—ఛా!

పేరుభట్టు—తహసీలుదారీ?

భద్రయ్య—వో!

పేరుభట్టు—సత్రంలో గుమాస్తాగిరీ ?

భద్రయ్య—త-ప్పు-లే-దు.

పేరుభట్టు — అయితే యేసూత్రంప్రకారం డవాలీపని తప్పన్నావూ ?

భద్రయ్య—అది నౌకరీ.

పేరుభట్టు—తహస్సీలుదారీ, గుమాస్తాగిరీనీ ?

భద్రయ్య—అవి వుద్యోగాలు.

పేరుభట్టు—అదేసూత్రం యిక్కడానూ.

భద్రయ్య—నాకు తృప్తికాలేదు.

పేరుభట్టు—ఫిడేలు వాయించడం బాగా నేర్చుకో ముందు.

భద్రయ్య—నన్నింత చచ్చుపెద్దమ్మకింద కట్టేశావూ ?

పేరుభట్టు—ప్లీడరుకి లా చదువుకు నేటప్పటుండే న్యాయపక్షపాతంవ్యవహారం ప్రారంభించాకవుండదుట.

భద్రయ్య—నే నొప్పుకోను. పువ్వుపుట్టగానే పరిమళం అన్నాడు.

పేరుభట్టు—నువ్వు ధర్మనిర్ణయం మహా చక చక చేసేస్తున్నావు గానీ, మొన్నటి పుష్కరాల్లో నువ్వు నీ పెళ్లానికి పంపించిన రెండు కాసులూ నీకెలావచ్చాయీ?

భద్రయ్య—అవునూ. నేను స్నానంచేసి స్వామి దర్శనం చేసుకుని వస్తూవుంటే అప్పుడే స్నానంచేసి వస్తూవున్న మావూరి పరంజ్యోతీ, దానికూతురు అమ్మణ్ణీ యిచ్చారు నాకు మంచిబ్రాహ్మణ్ణనీ.

పేరుభట్టు—వేశ్యలు స్నానంచేసి, గోదావరి వొడ్డున డబ్బివ్వడమూ, నేను మంచిబ్రాహ్మణ్ణని పిఱ్ఱీగే పెద్దమనిషి పుచ్చుకోడమూ—

భద్రయ్య—వొకదాల్లోనుంచి వొకదాల్లోకి లాగుచున్నావు.

పేరుభట్టు—పోనీ, ఆ పరంజ్యోతి నువ్వు మంచి పండితుడవని తాంబూలం యిస్తుంది. పుచ్చుకుంటావా?

భద్రయ్య—యెలాంటి తాంబూలమూ ?

పేరుభట్టు—యెలాంటి హంగూ ?

భద్రయ్య—అన్నిటికీ యుక్తే ప్రధానమా ?

పేరుభట్టు—తాను చేస్తే ప్రధానం. ఇతర్లు చేస్తే అప్రధానం. తీసెయ్యవోయ్ !

(వీరావధాని వస్తాడు.)

వీరావధాని—తీసేస్తూనేవున్నారు లెక్కలేకుండాను. ఇవాళ యిన్నిస్ పేటలో ఆరుగురు. ఆర్యాపురంలో పదకొండుగురు. వీరభద్రపురంలో యెనమండుగురూ. లక్ష్మీవారప్పేటలో ముప్ఫయిముగ్గురు. మంగళవారప్పేటలో పద్దెనమండుగురు. వూళ్లో ముప్ఫయిమంది. చింతకాయలు దుల్లినట్లే.

పేరుభట్టు—యేమిటోయి యీవుద్ధృతం ?

భద్రయ్య—అయితే యిక క్షణం వుండను నే నీవూళ్లో.

వీరావధాని—(చంకలోని మూట చూపించి) చూశావా ? గఫ్‌చిఫ్ ! (వెళ్లిపోతాడు.)

భద్రయ్య— రాత్రిబండిమీద వెళ్లిపోవడమే. ఏమంటావు ?

పేరుభట్టు—ఇంత ధైర్యంవుంది మీకు. సరే. నేను కాకినాడవెళ్లివచ్చి యిక్కడే వుంటాను. వారాలు మానేసి యీ కలరా తగ్గేదాకా—

భద్రయ్య—నీయిష్టం. బతికివుంటే బలుసాకు తిని బతకవచ్చు. ఈరాత్రి యిక్కడవుంటే భయమే రోగకారణం అవుతుంది. తప్పుకో. రైలుసంచీ సర్దుకోనియ్యి. గురువుగారితో చెప్పేం ?

పేరుభట్టు—వారుగూడా వెడితే చెప్పలేను. ఆలస్యం చేస్తే బండి దొరకదు.

భద్రయ్య—జెండా యెత్తేశాం. (వెళ్లిపోతాడు.)

పేరుభట్టు—(స్వగతం) ఈరాత్రి మామగారి యింటో భోంచేద్దాం. కాకినాడలో వారందినాలు పడుతుంది గనక యీసామానుగూడా అక్కడ పెట్టేస్తే మంచిది. తరవాత చూసుకోవచ్చు. మళ్లీ వచ్చేటప్పటికి స్నేహితులందరూ క్షేమంగావుంటారా ? ...అంతా దైవాధీనం......"నగుమోమూ గనలేనీ—"

(తెర దించవలెను.) (సశేషము)